క్లుప్తంగా

వర్గీకరణతో సమస్యల పరిష్కారం



రోడ్డుపై ఆందోళన చేస్తున్న ఎస్సీ నాయకులు

ఏలూరు రూరల్: ఎస్సీ వర్గీకరణతోనే బహుజనుల సమస్యలు పరిష్కారమౌతాయని ఎమ్మార్పీఎస్ ఏలూరు జిల్లా నాయకుడు కందుల రమేష్ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోరుతూ మంగళవారం ఇబ్రహీంపట్నం రోడ్డు కూడలిలో ధర్నా చేశామన్నారు. వర్గీకరణ కోరుతూ అన్ని సామాజిక వర్గాలను ఐక్యం చేస్తున్నామని, వర్గీకరణతోనే రాజ్యాధికారం సాధ్యమౌతుందని తెలిపారు. డాక్టర్ అంబేడ్కర్ సిద్ధాంతం ప్రకారం సామాజిక న్యాయ సమానత్వం సాధించే వరకు కేంద్ర ప్రభుత్వంపై పోరాడతామన్నారు. దేశంలో 90 శాతం పీడిత ప్రజలు సెంటు భూమి లేక దయనీయ స్థితిలో ఉన్నారని వివరించారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా చేశారు. వీఆర్ఏలకు కనీస వేతనం రూ.26 వేలు చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాజీ, కార్యదర్శి చంద్రశేఖర్‌లు మాట్లాడారు. అనంతరం కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు.

కరాటే పోటీల్లో పతకాలు

ఏలూరు రూరల్: కరాటే పోటీల్లో ఏలూరు సాధకులు పతకాలు సాధించారని ఏపీ కరాటే ఏపీ జపాన్‌షాటోకరాటే డు కనిస్‌జు ఆర్గనైజేషన్ కార్యదర్శి నాగం శివ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి 12 వరకు విశాఖపట్టణంలో అంతర్జాతీయ కరాటే పోటీలు జరిగాయని, ఈ పోటీల్లో పాల్గొన్న ఎం.మణి నాగశ్రీనివాస్, ఎం.ప్రీతిశ్రీజా, పి.భూపతి, వి.మోహిత్, పి.జయేష్‌గుప్తా, వి.తనూజ, జి.డేవిడ్, దుర్గాప్రసాద్, నితిన్‌సాయి కలిసి ఒక బంగారు, నాలుగు వెండి, మూడు కాంస్య పతకాలు సాధించారని వివరించారు. వీరంతా ప్రముఖ నటుడు సుమన్ చేతుల మీదగా సర్టిఫికెట్లు అందుకున్నట్టు పేర్కొన్నారు.

జాతీయ పోటీలకు కస్తూర్బా బాలికలు



జాతీయ పోటీలకు ఎంపికైన కస్తూర్బా బాలికలు

ఏలూరు రూరల్: జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఏలూరు కస్తూర్బా పాఠశాల బాలికలు ఎంపికయ్యారు. ఈ నెల 11వ తేదీ నుంచి 13 వరకు విజయవాడ సిద్ధార్థ కళాశాలలో నిర్వహించిన 66వ రాష్ట్ర స్థాయి అండర్-17 అంతర జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీల్లో ఏలూరు కస్తూర్బా స్కూల్ బాలికలు పి.జయశ్రీ, ఎస్.రేణుక రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని హెచ్ఎం జి.సునీత తెలిపారు. వీరిద్దరూ త్వరలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ కె.మురళీకృష్ణ వివరించారు. 10 రోజుల క్రితం ఇదే స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థినులు అండర్-14 బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్టుకు ఎంపికైన విషయం తెలిసిందే.

ఆలయంలో అన్నదానం

పెదపాడు: స్థానిక బల్లేరేవుతూము సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం నిర్వహించారు. మంగళవారం పురస్కరించుకుని పోల సింహాచలం జ్ఞాపకార్థం వారి కుమారుడు ఎల్ఐసీ ఏజెంట్ పోల వెంకటేశ్వరరావు ఆర్థిక సహాయంతో అన్నదానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రేముల గడ్డ రాము పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి సీఎం కృషి

ఎంపీ కోటగిరి శ్రీధర్



ఎంపీ శ్రీధర్‌కు పుష్పగుచ్ఛం అందజేసిన జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కామిల్ జమ, డైరెక్టర్ రవూఫ్ తదితరులు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని, అన్ని రంగాల్లోనూ ముస్లింలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రోత్సహిస్తున్నారని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఏలూరు జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ మహ్మద్ కామిల్ జమ స్థానిక ఎంపీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం శ్రీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ముస్లిం మైనార్టీల అభివృద్ధికి తామంతా ఎప్పుడూ కృషి చేస్తామని, వారికి అండగా ఉంటామని చెప్పారు. చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ముస్లిం వర్గానికి ఉప ముఖ్యమంత్రి పదవి కేటాయించారని, నలుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలు ఇచ్చి సముచిత స్థానం కల్పించారని తెలిపారు. చింతలపూడి నియోజకవర్గంలోని సీతానగరంలో శ్మశాన వాటిక పనులు పూర్తి చేస్తున్నామనీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ కామిల్ జమ తెలిపారు. కార్యక్రమంలో బోర్డు డైరెక్టర్ అబ్దుల్ రవూఫ్, చాణక్య కాలేజీ కరస్పాండెంట్ హసీన్, జహిద్ రహీమ్, తదితరులు ఉన్నారు.

హీరో గ్జూమ్ స్కూటర్ విడుదల



హీరో గ్జూమ్ స్కూటర్‌ను విడుదల చేస్తున్న డీఎస్పీ పైడేశ్వర రావు, పోలీస్ అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హీరో మోటార్స్ సంస్థ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన హీరో గ్జూమ్ స్కూటర్‌ను మంగళవారం స్థానిక సాయిస్వర్ణ హీరో షోరూంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏలూరు డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వర రావు విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్జూమ్ స్కూటర్ అద్భుతంగా, యువతను ఆకర్షించే విధంగా మెరుగైన భద్రతా ప్రమాణాలను కలిగి ఉందని అన్నారు. వాహన చోదకులంతా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. హీరో షోరూం జనరల్ మేనేజర్ ఏవీ సోమేశ్వర రావు మాట్లాడుతూ మొట్టమొదటి సారిగా కార్నరింగ్ బెండింగ్ ల్యాంప్‌తో రూపొందించిన ఈ వాహనం రాత్రిపూట ప్రయాణించే వారికి ఉపయోగకరమని చెప్పారు. ఈ స్కూటర్‌లో బ్లూటూత్ కనెక్టివిటీ, ఫుల్ డిజిటల్ స్పీడోమీటర్, సైడ్‌స్టాండ్ ఇంజిన్ కటాఫ్, ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్ వంటి ఫీచర్లతో రూపొందించామని వివరించారు. కార్యక్రమంలో ఒన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్, త్రీటౌన్ సీఐ వరప్రసాద్, సాయిస్వర్ణ షోరూం సర్వీస్ మేనేజర్ ఐ.పవన్ కుమార్, టూటౌన్ మెకానిక్స్ యూనియన్ అధ్యక్షుడు కృష్ణంరాజు, సాయిస్వర్ణ హీరో షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

మనసుని జయించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మానవుడు తన మనస్సును జయిస్తే సకల జగత్తునూ జయించినట్లేనని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఏలూరు సేవాకేంద్రం నిర్వాహకురాలు బీకే లావణ్య అన్నారు. స్థానిక శ్రీరామ్ నగర్‌లోని బ్రహ్మకుమారి సేవా కేంద్రంలో మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలను మంగళవారం పలువురు విద్యార్థినులు దర్శించుకున్నారు. వారితో లావణ్య మాట్లాడుతూ పరీక్షలపై ఉన్న భయాన్ని పోగొట్టుకోవాలని, రాజయోగాభ్యాసం ద్వారా ఇది సాధ్యమౌతుందని అన్నారు. నిత్యం సాయంత్రం మానసిక ఒత్తిడిని జయించేలా, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బీకే సుధారాణి, బీకే మమత, బీకే హిమబిందు, బీకే బాలాజీ, బీకే లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

15 నుంచి విశ్వబ్రాహ్మణ సంస్కృతిపై శిక్షణ

ఏలూరు (టూటౌన్): ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు వైశ్వకర్మణ వైదిక చరిత్ర త్రికాల సంధ్యావందనం సంస్కృతి సంప్రదాయాలపై ఉచిత శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఏపీ విశ్వబ్రాహ్మణ ధర్మ పీఠం కన్వీనర్ అప్పలభక్తుల శివకేశవరావు, సభ్యులు ముళ్లపూడి రాజా తెలిపారు. ఏలూరు పవరుపేటలోని కామాక్షి విశ్వబ్రాహ్మణ సత్రంలో 15న ఉదయం 9 గంటలకు శిక్షణను బ్రహ్మశ్రీ చంద్రపాటి నాగవరప్రసాదరావు ప్రారంభిస్తారని, నిత్యం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

ఏలూరు టౌన్: ఏలూరు బీడీ కాలనీలోని ఒక డ్రై క్లీనర్ దుకాణంలో పనిచేస్తోన్న వ్యక్తి భోజనానికి ఇంటికి వెళుతున్నట్టు చెప్పి కనిపించకుండా పోవటంపై ఏలూరు రూరల్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బీడీ కాలనీలోని ఒక డ్రైక్లీనర్ దుకాణంలో పనిచేస్తున్న ఏలూరు వన్‌టౌన్ పడమర వీధికి చెందిన మెట్టపల్లి ఓంకార్ మల్లికార్జునరావు (33) ఈనెల 9న భోజనానికి అని చెప్పి దుకాణం నుంచి మధ్యాహ్నం బయటకు వచ్చాడు. అప్పటి నుంచీ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు మంగళవారం ఏలూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మల్లికార్జునరావుకు భార్య, పిల్లలు ఉన్నారు.

పెదవేగి పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ

పెదవేగి : పెదవేగి పోలీస్ స్టేషన్‌ను ఏలూరు డీఎస్పీ ఈడా అశోక్ కుమార్ గౌడ్ మంగళవారం సాధారణ తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను ఆయన పరిశీలించారు. సిబ్బంది పనితీరును అభినందించారు. స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలపై పూర్తిస్థాయి విచారణ చేయాలని, డివిజన్‌లో అన్ని పోలీస్‌స్టేషన్లకు ఆదేశాలు జారీ చేసామని డీఎస్పీ చెప్పారు. ఏలూరు డివిజన్‌లో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. రేకుల షెడ్డులో కొనసాగుతున్న పెదవేగి పోలీస్‌స్టేషన్‌కు పక్కా భవన నిర్మాణ విషయంపై జిల్లా అధికారులకు వివరిస్తానని డీఎస్పీ తెలిపారు.

సైక్లింగ్‌తో శారీరక ఆరోగ్యం



సైకిల్ ఫర్ హెల్త్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ మోహన్

ఏలూరు రూరల్: సైక్లింగ్‌తో శారీరక ఆరోగ్యం సాధించవచ్చని డీసీహెచ్ఎస్ డాక్టర్ ఏవీఆర్ మోహన్ అన్నారు. మంగళవారం ఏలూరు ఇండోర్‌స్టేడియంలో సైక్లింగ్ ఫర్ హెల్త్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ సైక్లింగ్ చేయడం వల్ల కండరాల బలంగా మారడంతో పాటు శరీర బరువు తగ్గుతుందన్నారు. క్రమం తగ్గకుండా సైక్లింగ్ చేయడం వల్ల మధుమేహం ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధి సమస్యలు దూరం చేసుకోవచ్చని సూచించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ జీవన శైలి మార్చుకోవడం వల్ల అనేక మానసిక రుగ్మతలను రూపుమాపవచ్చన్నారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌ఓ రత్నకుమారి, సెట్‌వెల్ సీఈఓ ఎండీ మెహర్రాజ్, జిల్లా చీఫ్‌కోచ్ బి.శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో వైద్య సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం సహించేది లేదు



పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న పెదపాడు ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి

పెదపాడు: మండలం పరిధిలో అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని సహించేది లేదని పెదపాడు ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి ఆదేశాలు జారీ చేసారు. గ్రామ సచివాలయ సిబ్బంది అలసత్వం వహించవద్దని హెచ్చరించారు. పెదపాడు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం అభివృద్ధి పనులు పూర్తి చేసి ముందు వరసలో ఉండాలన్నారు. వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. నిర్ణీత గడువులోగా ఇంటి పన్నులు, నీటి పన్నులు వసూళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ వలంటీర్ల సహాయంతో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు గ్రామ సచివాలయ సిబ్బంది, కార్యదర్శులదే ప్రముఖ పాత్ర అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెదపాడు ఈఓ ఆర్డీ ఎస్ సూర్యకుమార్, ఏఓ రవికుమార్ వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బ్యాంక్ మేనేజర్‌పై హత్యకేసు నమోదు చేయాలి

ఏలూరు (టూటౌన్): ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన గంగుల రాటాలు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటనకు సంబంధించి స్టేట్ బ్యాంకు మేనేజర్‌పై హత్య కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని కోరారు. తిమ్మాపురం గ్రామానికి చెందిన మద్దిపాటి సత్యనారాయణ అనే రైతు స్టేట్‌బ్యాంక్‌లో రూ.3 లక్షల పంట రుణానికి రాటాలు హామీ సంతకం పెట్టాడని తెలిపారు. సత్యనారాయణ రుణం చెల్లించకపోవడంతో హామీ ఉన్న రాటాలుపై బ్యాంకు సిబ్బంది ఒత్తిడి చేసి ఖాతాను నిలిపివేశారని పేర్కొన్నారు. రాటాలు చిన్న కుమార్తె క్యాన్సర్‌తో బాధపడుతుండగా వైద్య ఖర్చుల నిమిత్తం డబ్బులు ఇవ్వమని బ్యాంకు మేనేజర్‌ను ప్రాధేయపడినా నిర్లక్ష్యంగా గెంటివేయడంతో మనస్థాపానికి గురై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని వివరించారు. రాటాలు కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ప్రభాకర్ కోరారు. మృతుని కుటుంబానికి సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీతోనే అన్నివర్గాలకూ న్యాయం



కర్ణాటి రాంబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న సగర సంఘం నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వైఎస్సార్‌సీపీ పాలనలోనే రాష్ట్రంలోని అన్ని వర్గాలకూ న్యాయం జరుగుతోందని సగర సంఘం నాయకులు పేర్కొన్నారు. విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్‌గా నియమితులైన సగర సామాజిక వర్గానికి చెందిన కర్ణాటి రాంబాబును ఏలూరులో మంగళవారం సగర సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు రాష్ట్రాన్ని సుభిక్షంగా మార్చుతున్నాయని సగర సంఘం జిల్లా అధ్యక్షుడు గుళ్లపల్లి నాగేశ్వరరావు అన్నారు. బీసీల అభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సగర కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుప్పాల ఆంజనేయులు మాట్లాడుతూ మంత్రివర్గంలో బీసీలకు స్థానం కల్పించడంతో ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం ముఖ్యమంత్రి చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సగర కుల జిల్లా యువజన అధ్యక్షుడు ఇబ్బా నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ సామాజికవర్గానికి విజయవాడ దుర్గ గుడి ట్రస్ట్ బోర్డు చైర్మన్ పదవిని కేటాయించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

అన్ని రంగాల్లో రాణించాలి



పురస్కారాలు అందుకున్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని, క్రమశిక్షణ, అంకితభావాలే ఎదుగుదలకు దోహదపడతాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎంవీ అవధాని పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా మార్కెటింగ్ సొసైటీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కోరమండల్ బాలికల ప్రతిభా పురస్కారాల ప్రదాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 9వ తరగతిలో చూపి 10వ తరగతి చదువుతోన్న 100 మంది బాలికలకు ఒక్కొక్కరికీ ప్రథమ బహుమతిగా రూ.5,000, ద్వితీయ బహుమతిగా రూ.3,500 చొప్పున, ప్రశంస పత్రాలను డీఈఓ అవధాని చేతుల మీదుగా అందజేశారు. సీఆర్ రెడ్డి కళాశాల కరస్పాండెంట్ మామిళ్లపల్లి జయప్రకాష్, కోరమండల్ డీజీఎం ఎం.సచ్చిదానంద రెడ్డి మాట్లాడుతూ కోరమండల్ సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ ఏడీఏ వై.సుబ్బారావు, కోరమండల్ సిబ్బంది కె.సుధాకర్, జి.శ్రీధర్, ఎం.మోహన్ కుమార్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కర్ణభక్తుల కృతజ్ఞతలు



వాసా రామకృష్ణారావును అభినందిస్తున్న కర్ణభక్తుల సంఘం నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కర్ణభక్తుల సామాజికవర్గానికి చెందిన వాసా రామకృష్ణారావుకు జిల్లాలోని ప్రతిష్టాత్మకమైన ద్వారకాతిరుమల దేవస్థానం ట్రస్ట్ బోర్డులో స్థానం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి శ్రీబసవేశ్వర కర్ణభక్తుల సంక్షేమ సంఘం కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు రామకృష్ణారావును జంగారెడ్డిగూడెంలోని ఆయన నివాసంలో మంగళవారం కలిసి ప్రత్యేకంగా అభినందించారు. ఆ వివరాలను సంఘ నాయకులు ఏలూరులో పత్రికలకు విడుదల చేశారు. పార్టీలో రామకృష్ణారావు సేవలకు మంచి గుర్తింపు లభించిందని సంఘ అధ్యక్షుడు శిద్దాని నాగ సూర్యనారాయణ, గౌరవాధ్యక్షుడు పొన్నా కోటేశ్వర రావు, ఉపాధ్యక్షుడు అల్లం సర్వేశ్వరరావులు హర్షం వ్యక్తం చేశారు. నాయకులు శలా నాగ తిరుమలేశ్వర రావు, తమ్మా శ్రీనివాసరావు, తమ్మా గణపతి, శిద్దాని ప్రసాద్, వాసా కోటేశ్వర రావు పాల్గొన్నారు.

ఏలూరు కాలువలో యువకుడి గల్లంతు

హనుమాన్ జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం ఎ.సీతారామపురం వద్ద కృష్ణా-ఏలూరు కాలువ రేవులోకి స్నానం చేసేందుకు దిగిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఏలూరు జిల్లా లక్కవరం మండలం దేవులపల్లి గ్రామానికి చెందిన తూరపాటి నాగరాజు (18) ఉపాధి నిమిత్తం గ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో ఏలూరు కాలువలో స్నానం చేసేందుకు మంగళవారం రేవు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలుజారి కాలువలోకి జారిపోవటంతో అక్కడే దుస్తులు ఉతుకుతున్న మహిళలు గుర్తించారు. కాలువలో నీటి ప్రవాహం వేగంగా ఉండటం, లోతు ఎక్కువగా ఉండటంతో నాగరాజు మునిగిపోయాడు. అతడిని కాపాడేందుకు మహిళలు చీర విసిరినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ ఘటనపై స్థానికుల నుంచి సమాచారం అందుకున్న వీరవల్లి పోలీసులు కాలువ దగ్గరకు చేరుకున్నారు. కాలువలో మునిగిన నాగరాజును గుర్తించేందుకు స్థానికులు విఫలయత్నం చేయగా, ఎన్డీఆర్ఎఫ్ దళాలను రప్పించారు. ఈ ఘటనపై వీరవల్లి ఎస్సై యూఎల్ సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నాగరాజు కోసం గాలింపు చర్యలను ఎస్సై పర్యవేక్షిస్తున్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్

పెదపాడు: రైతుల సమస్యలకు రీ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందని తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు తెలిపారు. మండలంలోని వీరమ్మకుంట శివారు రావులకుంట రెవెన్యూ పరిధిలో నూతన పరిజ్ఞానంతో జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా మంగళవారం భూ సర్వే చేపట్టి సరిహద్దులు గుర్తించే పనులను ప్రారంభించారు. భూ వివాదాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈ సర్వే చేపడుతోందని సర్వే అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో, భూ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	11
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	12
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	28
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	32
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

రూ.2.50 కోట్లతో సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం

- 14 గ్రామ శివారు ప్రాంతాలకు మెరుగైన వైద్యసేవలు
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



నూతన ఆరోగ్య కేంద్రాన్ని వైద్యులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి వచ్చిందని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. మంగళవారం దెందులూరులో రూ. 2.50 కోట్లతో నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం వైద్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. దెందులూరులో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మాణంపై ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు. అత్యాధునిక పరికరాలతో మెరుగైన వైద్య సేవలందించాలనే లక్ష్యంతో 30 పడకల వైద్యశాల మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరానన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు ప్రారంభిస్తామన్నారు. వైద్యులు, వైద్యసిబ్బంది రాష్ట్ర ప్రభుత్వం, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా మానవతా దృక్పథంతో వైద్యశాలకు వచ్చే ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణకు మెరుగైన సేవలందించాలన్నారు. వైఎస్సార్ సీపీ దెందులూరు గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, కోఆపరేటివ్ బ్యాంక్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, ఎంపీటీసీ తాళ్ళూరి నాగరాజు, పీహెచ్‌సీ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు కట్టా ఏసుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పులిపాటి శ్యామలా, కొంగర రత్నకుమార్ అబ్బాస్, చల్లా మేరీరాజు, పాలడుగు శ్రీనివాసరావు ఉన్నారు.